నమస్తే తెలంగాణ
నిజామాబాద్, మంగళవారం 29 అక్టోబర్ 2024
TUESDAY, OCTOBER 29, 2024

## లింగ నిర్ధారణపై విచారణ కొనసాగుతున్నది

### డీఎంహెచ్‌వో డాక్టర్ చంద్రశేఖర్


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ చంద్రశేఖర్

కామారెడ్డి, అక్టోబర్ 28 : లింగ నిర్ధారణపై విచారణ కొనసాగుతుందని డీఎంహెచ్‌వో డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఉన్న డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 25వ తేదీ రెండు స్కానింగ్ మిషన్లను సీజ్ చేసినట్లు చెప్పారు. పోలీసుల సహకారంతో అశోక్‌నగర్‌లోని రైల్వే గేట్ వద్ద స్కానింగ్ మిషన్‌ను తరలిస్తుండగా పట్టుకొని విచారించగా ఆ వాహనం నడిపి సిద్ధిరాములుకు చెందినదిగా గుర్తించామన్నారు. సిద్ధిరాములుకు తెలిసిన పృథ్వీ ఇంట్లో ఈ స్కానింగ్ వ్యవహారం కొనసాగుతున్నదని తెలుసుకొని అక్కడికి వెళ్లి తనిఖీ చేయగా మరొక స్కానింగ్ మిషన్ లభించిందన్నారు. ఇందులో ఒక మిషన్ సిద్ధిరాములు కొడుకు డాక్టర్ ప్రవీణ్ పేరిట రిజిస్ట్రేషనై ఉందని తెలిపారు. ఈ రెండు మిషన్లను సీజ్ చేసి కోర్టులో సరెండర్ చేయగా విచారణ జరుగుతున్నదని చెప్పారు. సిద్ధిరాములు, పృథ్వీలకు నోటీసులు జారీ చేసి చేసినట్లు చెప్పారు. సిద్ధిరాములు వద్ద పని చేసిన వారే మొబైల్ టీంగా ఏర్పడి ఇండ్లల్లో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని తె లిపారు. ఈ విషయంలో తమ శాఖలో ఎలాంటి లోపం లేదని, ప్రజల్లో అవగాహన రావాలని అన్నారు. గతంలో సమన్విత దవాఖానను సీజ్ చేస్తే హైకోర్టులో స్టే తెచ్చుకొని మళ్లీ దవాఖానను నడిపిస్తున్నారని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ సుమిత్రా నాయక్, పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పటాకుల గోదాంకు తాళం


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న యువకులు

కామారెడ్డి రూరల్, అక్టోబర్ 28 : కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి గ్రామ శివారులో ఉన్న పటాకుల గోదాంకు దేవునిపల్లి పోలీసులు, ఫైర్ అధికారులు కలిసి తాళం వేశారు. కామారెడ్డి రూరల్ ఎస్సై రాజు, ఫైర్ అధికారి సయ్యద్ మహ్మద్ అలీ ఆధ్వర్యంలో గోదాంపై దాడులు చేశారు. జిల్లాస్థాయి అధికారుల ఆదేశాల మేరకు గోదాంకు తాళం వేసినట్లు తెలిపారు.

**అనుమతులు లేకుండా పటాకులు విక్రయించొద్దు**

రాజంపేట్, అక్టోబర్ 28 : మండల కేంద్రంలో అనుమతులు లేకుండా పటాకులు విక్రయించొద్దని, అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై పుష్పరాజ్ అన్నారు. పటాకుల దుకాణాన్ని ఏర్పాటు చేసుకోవాలనుకుంటే డీఎస్పీ నుంచి అనుమతులు పొందాలన్నారు.

**వినతిపత్రం అందజేత**

నస్రుల్లాబాద్, అక్టోబర్ 28 : బీర్కూర్‌లోని తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ లతకు యువకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఏర్పాటు చేయనున్న బాణసంచా దుకాణాల్లో దేవి, దేవతామూర్తుల ఫొటో ఉన్న పటాకులు విక్రయించకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ యువకులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్
- 'ప్రజావాణి'కి 64 ఫిర్యాదులు


ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, అక్టోబర్ 28 : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆయా శాఖల అధికారులకు సూచించారు. కామారెడ్డి సమీకృత కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చే ఫిర్యాదులను రెవెన్యూ అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో 64 వినతులను స్వీకరించినట్లు తెలిపారు. గత వారం వరకు 18,360 అర్జీలు రాగా వాటిని పరిశీలించి 17,752 అర్జీలను ఆయా శాఖల అధికారులు పరిష్కరించారని, 608 పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్వీ రంగనాథ్ రావు, జడ్పీ సీఈవో చందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**ప్రజావాణికి ఫిర్యాదులు నిల్.. కనిపించని అధికారులు..**

నాగిరెడ్డిపేట/బిచ్కుంద/రాజంపేట్, అక్టోబర్ 28: నాగిరెడ్డిపేట తహసీల్‌లో సోమవారం జరిగిన ప్రజావాణికి ఒక్క ఫిర్యాదు కూడా అందలేదని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావలసి ఉండగా.. ఎంపీడీవో ప్రభాకర్, ఏపీవో సాయిలు, ఐకేపీ సీసీ, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మాత్రమే వచ్చారన్నారు. బిచ్కుందలో ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు డుమ్మా కొట్టారు. వినతులు ఎవరికి ఇవ్వాలో అర్థంకాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి తహసీల్దార్ సురేశ్, ఎంపీడీవో గోపాలకృష్ణ, ఎంపీవో కృష్ణ, ఏపీఎం నాగరాజు, బాలికల హాస్టల్ వార్డెన్ సంధ్య హాజరయ్యారు.
రాజంపేట తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎలాంటి ఫిర్యాదులు రాలేవని తహసీల్దార్ అనిల్ కుమార్ తెలిపారు

## వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తే.. అవమానించారు..

### సీపీఎం నాయకులు

కామారెడ్డి, అక్టోబర్ 28 : జిల్లా కేంద్రంలో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్న దవాఖానలపై సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేయడానికి వెళ్తే కలెక్టర్ తమను అవమానించారని సీపీఎం నాయకులు ఆరోపించారు. కామారెడ్డి పట్టణంలో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్న దవాఖానలపై చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నా.. వాటిని మళ్లీ రీ ఓపెన్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై ప్రజావాణిలో ఫిర్యాదు చేయడానికి వెళ్లగా.. మెట్ల మీద నుంచి కిందకు దింపి దూరంగా ఉండి మాట్లాడాలని, దగ్గరికి రావొద్దంటూ కలెక్టర్ తమను అవమానించారని ఆరోపించారు. ఇందుకు నిరసనగా కలెక్టరేట్ డోర్‌కు వినతి పత్రం ఇచ్చినట్లు సీపీఎం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు,


డోర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

## చెత్త సేకరణ బండ్లు ప్రారంభం

కామారెడ్డి, అక్టోబర్ 28 : జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో చెత్త సేకరణకు 76 తోపుడు బండ్లను మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందూప్రియ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణంలో రోడ్లపై చెత్తను వేయొద్దని, చెత్త కుండిలోనే వేయాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అనూష, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళను కాపాడిన పోలీసులు

నస్రుల్లాబాద్, అక్టోబర్ 28 : బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన అనిత బీర్కూర్ భజన్ చెరువులో ఆత్మహత్యకు యత్నించగా.. సోమవారం పోలీసులు రక్షించారు. వివరాల్లోకి వెళ్తే.. అనిత బీర్కూర్‌లో నివాసం ఉంటున్నది. కొంత కాలంగా ఆమె ఆరోగ్యం సరిగాలేక లేకపోవడంతో మనస్తాపంతో బీర్కూర్ శివారులోని భజన్ చెరువులో దూకింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆమెను చెరువులో నుంచి బయటికితీసి బీర్కూర్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స చేయించి ఇంటికి పంపించారు.


పండరిపూర్‌కు పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

## పండరిపూర్‌కు భక్తుల పాదయాత్ర

బాన్సువాడ రూరల్, అక్టోబర్ 28 : బాన్సువాడ మం డలం సోమేశ్వర్ గ్రామ సోమలింగాల ఆలయం నుంచి పండరిపూర్‌కు సోమవారం భక్తులు పాదయాత్రగా వెళ్లా రు. రాములు, నాందేవ్, కబీర్, శంకర్ మహరాజ్ ఆధ్వర్యంలో భక్తులు పాదయాత్రగా తరలి వెళ్లారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేశామని, నెల రోజులపాటు ఈ పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రోహిత్, భక్తులు పర్వంరెడ్డి, నర్సింహులు, భరత్, గణేశ్, సాయిలు, భక్తులు పాల్గొన్నారు.

## సౌత్ క్యాంపస్‌లో కరపత్రాల ఆవిష్కరణ

భిక్కనూరు, అక్టోబర్ 28 : టీయూ సౌత్ క్యాంపస్‌లో హైదరాబాద్ జేఎన్టీయూలో నిర్వహించనున్న వర్క్‌షాప్‌నకు సంబంధించి కరపత్రాలను ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, కన్వీనర్ గౌతం, అధ్యాపకులు సోమవారం ఆవిష్కరించారు. వచ్చే నెలలో 8, 9వ తేదీల్లో 'పరిశోధన, ఆవిష్కరణలు భారతదేశం' అనే అంశంపై జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీ, విశ్వ విద్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రతిజ్ఞ, మోహన్‌బాబు, లలిత, యాలాద్రి, శ్రీకాంత్, నారాయణ, వైశాలి, శ్రీమాత, రమాదేవి, దక్షిణ ప్రాంగణ పరిశోధన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


సౌత్ క్యాంపస్‌లో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ సుధాకర్ గౌడ్

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న పోచారం శ్రీనివాసరెడ్డి, కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ, అక్టోబర్ 28 : బాన్సువాడలోని పోచారం స్వగృహంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని 104 మందికి రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి.. రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంగాధర్, ఏఎంసీ మాజీ చైర్మన్ సురేశ్, మనోహర్, మోహన్‌నాయక్, కౌన్సిలర్ కిరణ్‌కుమార్, రఫీ, హకీం, నర్సుగొండ, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి ఉన్నారు.

**పాదయాత్రను ప్రారంభించిన పోచారం**

బాన్సువాడలోని అయ్యప్ప ఆలయం నుంచి శబరిమలకు అయ్యప్ప స్వాముల బృందం పాదయాత్రను రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు ముదిరెడ్డి విఠల్‌రెడ్డి, మహాపాద యాత్ర గురుస్వామి గురువినయ్ కుమార్, కౌన్సిలర్ రోహిత్, వీరప్ప తదితరులు ఉన్నారు.

**రూ.15 కోట్ల నిధుల విడుదల**

బాన్సువాడ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు సీఆర్‌ఆర్ గ్రాంటు కింద రూ.15 కోట్ల నిధులు మంజూరైనట్లు రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో కొనసాగుతున్న రోడ్లు, తదితర పనులకు నిధులు మంజూరైనట్లు తెలిపారు.

## వినతిపత్రం అందజేత


బొమ్మన్‌దేవ్‌పల్లిలో ప్రధానోపాధ్యాయుడికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

నస్రుల్లాబాద్, అక్టోబర్ 28 : నస్రుల్లాబాద్ మండలం బొమ్మన్‌దేవ్‌పల్లిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి సోమవారం గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. పాఠశాలలో పనిచేసే ఫిజిక్స్ టీచర్ వెంకాగౌడ్‌ను పాఠశాల నుంచి రిలీవ్ చేయకూడదని, వివాదాస్పదుడైన బుడ్మి ప్రధానోపాధ్యాయుడు ఖలీల్‌ను పాఠశాలలో జాయిన్ చేసుకోకూడదని గ్రామస్తులు తీర్మానం చేశారు.

## ఇసుక ట్రాక్టర్ సీజ్

లింగంపేట, అక్టోబర్ 28: మండలంలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన నాగల్ల ఆనంద్‌కు చెందిన ట్రాక్టర్ సీజ్ చేసినట్లు ఎస్సై అరుణ్ సోమవారం తెలిపారు. ఆనంద్ అనుమతి లేకుండా ఐలాపూర్ గ్రామ శివారులోని పాముల వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. ఇసుక తరలిస్తున్న ఆనంద్‌పై కేసు నమోదు చేసి ట్రాక్టర్ సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

## గంధం చెట్లు అపహరణ


గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయిన గంధం చెట్లు

లింగంపేట(తాడ్వాయి), అక్టోబర్ 28: తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన ఆకేటి శ్రీకాంత్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రం నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ఏడు గంధం చెట్లను అపహరించుకుపోయినట్లు రైతు తెలిపాడు. నాలుగు సంవత్సరాల క్రితం వ్యవసాయ క్షేత్రంలో గట్లపై పది గంధం మొక్కలు నాటినట్లు తెలిపారు. మొక్కలు నాటిన నుంచి రాత్రి పూట కాపలా ఉండేవారన్నారు. ఆదివారం రాత్రి ఎవరూ కాపలా లేకపోవడంతో కోత యంత్రం సహాయంతో ఏడు గంధం చెట్లను కోసి అపహరించుకుపోయినట్లు బాధిత రైతు తెలిపాడు. అపహరించిన గంధం చెట్ల విలువ సుమారు రూ.లక్షకు పైగా ఉంటుందని పేర్కొన్నారు.

## కామారెడ్డి జిల్లా వాసికి సత్కారం


జిల్లా వాసిని సత్కరిస్తున్న దృశ్యం

రామారెడ్డి అక్టోబర్ 28 : భారతీయ కళాసంస్కృతి 8వ ఆన్యూవల్ ఈవెంట్ హైదరాబాద్‌లోని (పీనిక్స్ ఆరేనా) మాదాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డ్యాన్స్, ఆర్ట్స్, నృత్యం, సంగీతంలో రాష్ట్రస్థాయిలో డిస్టింక్షన్ సాధించినందుకు విద్యార్థులను ఘనంగా సన్మానించారు కామారెడ్డి జిల్లా అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన దీపికను పేరణిలో డిస్టింక్షన్ సాధించినందుకు మెమోంటో, చెక్‌తో పాటు శాలువాతో సన్మానించారు.

## పెండింగ్ పనులను పూర్తి చేయాలి


శ్మశాన వాటికను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 28: పట్టణంలో నిర్మాణంలో ఉన్న శ్మశాన వాటిక పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలని మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ సూచించారు. పట్టణంలోని 1406 సర్వే నెంబర్ గల రెండు ఎకరాల స్థలంలో రూ.2 కోట్ల వ్యయంతో కొనసాగుతున్న శ్మశానవాటిక పనులను ఆయన పరిశీలించారు. పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఏఈ వినోద్‌ను మున్సిపల్ చైర్మెన్ ఆదేశించారు. కౌన్సిలర్ జంగం నీలకంఠం అప్ప, నాయకులు నునుగొండ శ్రీనివాస్, తిరుపతి, పోచయ్య మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

## బదిలీపై వెళ్లిన ఎంఈవోకు సన్మానం

రాజంపేట్, అక్టోబర్ 28 : బదిలీపై వెళ్లిన ఎంఈవో రామస్వామిని మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో సోమవారం సన్మానించారు. ఆరేండ్లుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తుండడంతో ఆయనను శాలువాతో సన్మానించారు. మండల విద్యాధికారి పూర్ణచందర్‌రావు, రాజంపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఈశ్వరయ్య, కంప్యూటర్ ఆపరేటర్, ఎంఐఎస్ కోఆర్డినేటర్, ఐఈఆర్‌పీ, సీఆర్పీలు సన్మానించారు.

# ఇష్టంతో చదివితేనే ఉన్నత కొలువులు



గాంధారి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి షేక్ సలాం

గాంధారి, అక్టోబర్ 28: విద్యార్థులు భవిష్యత్తుల్లో ఉన్నత కొలువులు సాధించాలంటే, చదువు కోవాలనే ఇష్టాన్ని పెంచుకోవాలని జిల్లా ఇంటర్‌మీడియెట్ నోడల్ అధికారి షేక్ సలాం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విదార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజు కళాశాలకు తప్పకుండా హాజరుకావాలని, చదువుల్లో రాణించాలంటే, చదువుపై మక్కువ పెంచుకోవాలని తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత కొలువులు సాధించాలంటే కష్టపడి చదవడం కన్నా, ఇష్టపడి చదువుకోవాలని, కళాశాలలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాలప్రిన్సిపాల్ గంగారాం, అధ్యాపకులు రాజ్‌గోపాల్, లక్ష్మణ్, శ్రీధర్, విజయ్‌కుమార్, రమేశ్, వెంకటస్వామి, సరిత, సుజాత, స్వప్న, రాజ్‌కుమార్ ,అంజలి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలి


ధర్నాలో పాల్గొన్న మాజీ ఎంపీ బీబీపాటిల్

నాగిరెడ్డిపేట, అక్టోబర్ 28: వరి కొనుగోలు కేంద్రాల ను వెంటనే ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీ బీబీ పాటిల్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బీజేపీ అధ్వర్యంలో సోమవారం చేపట్టిన రైతు పోరుయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ప్రధాన రహదారిపై ర్యాలీగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తహసీల్ కార్యాలయం చేరుకున్నారు. తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాస్, సీఐ రవిందర్, నాగిరెడ్డిపేట, లింగంపేట, ఎల్లారెడ్డి ఎస్సైలు మల్లారెడ్డి, అరుణ్‌కుమార్, మహేశ్, మూడు మండలాల సిబ్బంది, జిల్లా కేంద్రం నుంచి ఏఆర్, ప్రత్యేక బందోబస్తు చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నందన్‌రావు, అసెంబ్లీ కన్వీనర్ లింగారావు, జిల్లా కార్యదర్శి హన్మండ్లు, జిల్లా నాయకులు ఉన్నారు.

**ఆర్డీవోకు వినతిపత్రం..**

నాగిరెడ్డిపేట : రైతులు పండించిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కోరుతూ.. సోమవారం ఆర్డీవో ప్రభాకర్‌కు మాజీ ఎంపీ బీబీపాటిల్, బీజేపీ నాయకులు వినతిపత్రం అందించారు. దాదాపు 45 రోజులుగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోఉంచి రైతులు పడిగాపులు కాస్తున్నా ఇప్పటి వరకు కొనుగోలు ప్రారంభించలేదని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.
కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజమోహన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి హన్మండ్లు, మండల పార్టీ అధ్యక్షుడు సత్యబోయిన శ్రీకాంత్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు దేవీసింగ్ తదితరులు ఉన్నారు.

## పాఠ్యపుస్తకాల పంపిణీ

లింగంపేట, అక్టోబర్ 28: మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలకు రెండో విడుత పాఠ్య పుస్తకాలను పంపిణీ చేసినట్లు మండల విద్యాశాఖాధికారి షౌకత్ అలీ తెలిపారు. రెండో విడుతలో 12,080 పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. సోమవారం మండల విద్యావనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠ్యపుస్తకాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

## భవానీపేటలో పశువైద్య శిబిరం


పశువైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యురాలు, స్థానికులు

లింగంపేట, అక్టోబర్ 28: మండలంలోని భవానీపేట గ్రామంలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 300 గేదేలు, 50 ఆవులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశు వైద్యాధికారి హనా జోనస్ తెలిపారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ రవికుమార్, గోపాల మిత్రలు ఏజాస్, మల్లేశ్, రమేశ్, వెంకటి రైతులు పాల్గొన్నారు.

## అల్పతరం మీద గణితశాస్త్రం ప్రభావం

రామారెడ్డి, అక్టోబర్ 28 : జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీ ఆధ్వర్యంలో యూనివర్సిటీ క్యాంపస్‌లో 'అల్పతరం మీద గణిత శాస్త్ర ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వర్క్ షాప్‌లో తమ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ చూపారని సదాశివనగర్ మండలం మర్కల్ మల్లన్న గుట్ట సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి సోమవారం తెలిపారు. గణితశాస్త్రం ఈజీ ట్రిక్స్ అనే పోటీలో ప్రథమ బహుమతిని ఎమ్‌ఎస్‌డీఎస్ రెండో సంవత్సరం చదువుతున్న నిఖిత, క్విజ్ పోటీల్లో ద్వితీయ బహుమతిని జ్యోతి గ్రూప్ గెలుచుకున్నారన్నారు. వీరిని ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ ఉదయిని, అకడమిక్ కో-ఆర్డినేటర్ వనజ, గణితశాస్త్ర విభాగాధిపతి కే శ్రీలత, అధ్యాపకబృందం అభినందించారన్నారు.


నూతన జిల్లా స్టీరింగ్ కమిటీ నూతన కార్యవర్గం

## జిల్లా జేఏసీ స్టీరింగ్ కమిటీ ఎన్నిక

కామారెడ్డి, అక్టోబర్ 28 : రాష్ట్ర టీఈజీజేఏసీ జిల్లా జేఏసీ స్టీరింగ్ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. జిల్లా చైర్మన్‌గా వెంకట్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ దేవేందర్, అడిషనల్ సెక్రటరీ జనరల్ కుశాల్, కో చైర్మన్‌గా అనిల్‌కుమార్, సాయిలు, ప్రేమ్ కుమార్, హన్మంత్ రెడ్డి, రాజు, ముజీబుద్దీన్, నిజాం, దేవులు, విఠల్‌రావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ సాయిలు, సాయిరెడ్డి, ఎల్లారెడ్డి, వైస్ చైర్మన్ పూర్ణచందర్, బషీర్, అంబీర్ మనోహర్ రావు, ఫైనాన్స్ సెక్రటరీ చక్రధర్, పబ్లిసిటీ సెక్రటరీ భూమయ్యను ఎన్నుకున్నారు.

## అయ్యప్ప స్వాములకు పండ్ల పంపిణీ

పెద్దకొడప్‌గల్, అక్టోబర్ 28: శబరిమలకు పాదయాత్రగా వెళ్తున్న అయ్యప్ప స్వాములకు సోమవారం పిట్లం ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో పండ్లు, ఫలహారాలు పంపిణీ చేశారు. బాన్సువాడ నుంచి శబరిమలై వెళ్తూ పిట్లం చేరుకోవడంతో పండ్లు పంపిణీ చేసినట్లు ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షుడు కుమ్మరి హన్మంతు తెలిపారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## దళారులకు ధాన్యం అమ్మి నష్టపోవద్దు

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 28 : కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి నష్టపోవద్దని ఎల్లారెడ్డి సొసైటీ అధ్యక్షుడు ఏగుల నర్సింహులు అన్నారు. సోమవారం మండలంలోని కొక్కొండ, సోమార్‌పేట్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు బాలరాజు, నారాయణ, సూర్యప్రకాశ్, సొసైటీ సెక్రటరీ విశ్వనాథం, రెండు గ్రామాల మాజీ సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

## లైన్‌మన్‌కుసన్మానం

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 28: మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డిపేట్ గ్రామానికి లైన్‌మన్‌గా బదిలీపై వచ్చిన బాల్‌కిషన్ గౌడ్‌ను సోమవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వార్డు కౌన్సిలర్ భూంగారి రాము, వెంకట్‌నారాయణ, గ్రామస్థులు ఉన్నారు.

## పారిశుధ్య పనుల పరిశీలన

గాంధారి, అక్టోబర్ 28: మండల కేంద్రంలో సోమవారం ప్రధాన రోడ్డుపై చేపట్టిన పారిశుధ్య పనులను ఎంపీడీవో రాజేశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామపంచాయతీ సిబ్బందితో రోడ్డుపై ఉన్న చెత్తా చెదారాన్ని తొలింగింపజేశారు. గ్రామకార్యదర్శి నాగరాజు ఉన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


బండపల్లిలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పెద్ద కొడప్‌గల్, అక్టోబర్ 28 : ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు తెలిపారు. మండలంలోని బండపల్లి గ్రామస్తులకు సైబర్ నేరాలపై సోమవారం పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల్లో వచ్చే మెసేజ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఉచితాలకు ఆశపడి మోసపోవద్దన్నారు. కెనరా, ఎస్‌బీఐ బ్యాంక్ రివార్డు లింక్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపొద్దని సూచించారు. పోలీసు సిబ్బంది నగేశ్, శ్రీకాంత్,గ్రామస్తులు రాజు,సంగబోయి, సాయిలు, రాములు, తదితరులు పాల్గొన్నారు.

## ఈద్గావద్ద బోరుమోటారు ఏర్పాటు

నాగిరెడ్డిపేట,అక్టోబర్ 28: మండలంలోని ఆత్మకూర్ ఈద్గా వద్ద నూతన బోరుమోటారును ఏర్పాటు చేసినట్లు మాజీ జడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి తెలిపారు. గ్రామంలోని ముస్లింల సౌకర్యార్థం రూ. లక్షతో బోరు మోటారును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వారి కోరికమేరకు త్వరలో ఐలోజింగ్ లైట్స్‌ను ఏర్పాటు చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామ ముస్లింలు ఆయనను శాలువాతో సన్మానించారు.